

# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఇది బయోపిక్‌ల యుగం

**ఇది బయోపిక్‌ల యుగం.** పొద్దున్నే లేవగానే మా వారు "నీకో లింక్ పంపాను విను. ఎవరో దేవదత్త అన్నవాడు కథలు ఎలా రాయాలో చెప్పాడు యూ ట్యూబ్‌లో" అన్నారు. నా కెంతకోపం వచ్చిందంటే సచ్చిన్ టెండూల్కర్‌ని వాళ్ళావిడ "పేపర్ వాడు ఎంత బాగా పేపర్ విసురుతున్నాడో చూడు. దాన్ని సరిగ్గా క్యాచ్ పట్టడం నేర్చుకో" అన్నట్లుగా అనిపించింది. మూడు వందల కథలు రాసా. పాపం పత్రికలవాళ్ళు ప్రచురించారు. పేరుంది కదా అని అన్నీ వేసుకోరు. కొన్ని తిప్పి పంపి వాళ్ళ బాధ్యత వాళ్ళు నెరవేర్చుకుంటారు. అయినా మరీ ఇంత అలుసా?

అయినా పంపారు కదా తిట్టేముందు ఓసారి ఏం చెప్పాడో విందామని చూసా. నాన్‌సెన్స్. కథకి విలన్ వుండాలని చెప్పాడు. నా శిష్యుడు అనిల్ రావిపూడి ఎఫ్2 సినిమాలో "అంతేగా... అంతేగా" అని నేర్పించాడు భర్తలకి. పెళ్ళాం ఏం చెప్పినా 'అంతేగా' అంటే మొగుళ్ళకి కూరల్లో కారం, ఉప్పూ ఎక్కువవవు ఆ రోజు.

మా అక్కలు అంటారు "మన పిల్లల తరంలో పెళ్ళాం మాట జవదాటడంలేదు. మన మొగుళ్ళు ఇప్పటికీ మనమాట వినరు సరికదా విమర్శించి చంపుతారేవిటే?" అని.

నేను వెంటనే "కాంప్లెక్స్ అక్కా. మనం తెలివైనవాళ్ళం అనీ" అన్నాను.

ఇంతకీ దేవదత్త ఏం అన్నాడో తర్వాత చెప్తాగానీ, ఈ మధ్య చూసిన బయోపిక్స్‌లా. రేపొద్దున్న మనమూ ఫేమస్ అయి ఎవరైనా బయోపిక్ తీయడానికి మన జీవిత కథ రాయమంటే.. విలన్లుగా మరీ మొగుడ్ని పెడితే బావుండదు కానీ, వేరే ఎవర్ని పెడ్దాం అని ఆలోచించా. చిన్నప్పుడు చైల్డ్ ఎపిసోడ్ వుంటుంది కాబట్టి, అస్తమానం లెక్కల్లో కొశ్చెన్స్ అడిగి చెయ్యి వెనక్కి తిప్పమని వేళ్ళమీద రూళ్ళకర్రతో కొట్టే స్కూల్లో 'మసోడు' డేవిడ్ మాస్టర్నో, చిన్నప్పుడు చందమామలు అడిగితే 'దానికి ఇవ్వకు. అది మళ్ళీ ఇవ్వదు' అని నేర్పించి పెట్టిన మంజూ వాళ్ళక్కనో, లేదా రచనలు చెయ్యడం మొదలుపెట్టిన కొత్తలో, నా ప్రతి నవలా కాపీ కొట్టి, తనవే ఒరిజినల్ అని క్లైమ్ చేసిన ఓ ఛండాలపు రచయిత్రినో.. నేను తన స్కూల్లో 500 రూపాయలకి ఉద్యోగం చేస్తూ, అమాంతం ఫేమ్ సంపాదిస్తున్నాను రచయిత్రినై అని భావించి టెర్మినేట్ చేసిన స్కూల్ ఓనర్నో (పోస్ట్‌మేన్ సంచీడు ఉత్తరాలు పట్టుకొచ్చి అతని రూమ్ వద్ద పడేసి 'రమణీ మేడం ఫ్యాన్ మెయిల్' అంటే ఒళ్ళుమండదూ పాపం.) ఇలా ఎవర్ని విలన్‌లుగా పెట్టాలా అని తల బద్దలు కొట్టుకుని ఆలోచించా.

నా కసలు చిన్నప్పుడు నా చుట్టూ విలన్స్ వుండేవాళ్ళు. 'మీ మనవరాలు స్కూల్ డుమ్మా కొట్టి బాలాజీ టాకీస్‌లో 'ఆప్తమిత్రులు' సినిమాకి వెళ్ళింద'ని అమ్మమ్మతో చెప్పే అనసూయా వాళ్ళమ్మా, క్రీస్తుమణి టీచర్ దగ్గర నా మీద హోం వర్క్ చెయ్యకుండా

చెన్నకేశవరావు ఇంట్లో కిటికీ ఊచలు పట్టుకుని వూగుతూ టీ.వీలో సినిమా చూడ్డానికి ఎగబడ్తున్నాను అని చెప్పిన రయిసా, సైకిల్ మీద నేను వెళ్తుంటే కావాలని డాష్ ఇచ్చి పారేసిన డేనియల్ గాడూ, నేను క్లాసు పుస్తకాల బదులు కథలు చదువుతున్నాను పుస్తకాల్లో దాచుకుని, అదీ అపరాధపరిశోధన నవలలు అని అమ్మమ్మకి చెప్పేసిన అన్నయ్యా, కేవలం పౌడర్ లేకుండా స్కూల్‌కి వెళ్ళనన్నానని 'దీనికి షోకులెక్కువ' అని అమ్మ చేత తిట్టించిన పెద్దమ్మ కూతుళ్ళూ... ఇలా ఎన్నో ఎపిసోడ్లలో ఎందరో విలన్స్ వల్ల దెబ్బలూ, బాధలూ పడ్డాను. ఇప్పుడిలా స్వంత కొంపలోనే నేనేం రాస్తానో, రాస్తున్నానో తెలీకుండా, నా నేమూ, ఫేమూ వుల్లిపరకలా తీసి పారేసి "ఆ ఒరియా వాడెవరో రైటింగ్ ఎలా చెయ్యాలో చెప్తున్నాడు యూ ట్యూబ్‌లో నేర్చుకో" అని మొగుడు అంటే నేనేం జవాబు చెప్పాలి?

అప్పుడు నాకో ఐడియా వచ్చింది. నా బాల్యం, సందానీగాడి బాల్యం అని విడదీయలేము. ఇద్దరిదీ కలిపే వుంటుంది. పోనీ వాడి బయోపిక్కే తీస్తే పోలా? అని.

సందానీ ఎవరో జనానికి తెలియక్కర్లేదు. మనం తీసాక తెలుస్తుంది. అసలు జనానికి నిజాలు తెలియకపోతేనే మంచిది. రేప్పొద్దున్న సినిమాలో సీన్లు పండడానికి అబద్దాలు తీసారు అంటూ 'యూ ట్యూబ్'లలో తెగ మోగరు. కొంతమంది 'యూ ట్యూబ్'లో ఎవరి ఆత్మకథైనా వీళ్ళ కథలా ఆ ఆత్మని వీళ్ళు రోజూ పోషిస్తున్నట్లు వాపోతుంటారు.

అసలు ఎవరి బయోపిక్ తీసినా వాళ్ళు చిన్నప్పుడు చాలా బాధలు పడ్డారు. కష్టపడి ఏ వీధిలైట్ల కిందో చదువుకున్నారు. లేదా ఏ పెద్దమ్మ గారింట్లోనో తిండికి గడవక తలదాచుకున్నారు అని చెప్తారు.

మా సందానీకూడా చాలా బాధలు పడ్డాడు. సొంత కొంపే అయినా, వాడు పడుకునే గోనె పట్టా మీద ఇంటికొచ్చిన చుట్టం గురకపెట్టి నిద్రపోతుంటే, వాడి పీచుగడ్డానికి తేనె రాసి, వాటికి చీమలు పడితే అతను గెడ్డం పీక్కుంటూ లేచి కూర్చుంటే ఆ గోనె పట్టా లాక్కుని వేసుకుని పడుకునేవాడు. ఇంక వీధి లైట్లలో చదువుకోకపోయినా, రాత్రిపూట మా వరండాలో లైట్ వేస్తే వచ్చి, చినిగిన పతంగులు అన్నం మెతుకులు పెట్టి అతికించుటా, నా సోషల్ స్టడీస్ పుస్తకంలోంచి బొమ్మలు కత్తిరించి వాటికి, రంగు రంగుల కాయితాలతో షర్ట్లూ, పాంట్లూ చెయ్యడం ఎలాగో నాకు నేర్పించుటా, రాత్రిపూట బయటకొచ్చే కీచురాయీ, రోకలి బండలూ, కప్పలులాంటి ప్రాణులని పట్టి, వాటి నోరూ తోకా నాకు చూపించే సైన్స్ శిక్షణా ఇత్యాదులు చేసేవాడు పాపం.

ఆ చైనా వాడెవడో భారతదేశం మొదటిసారి వచ్చాడట. వాడి పేరు మన నోరు తిరగదు. హ్యూమాయింగ్ సా లాంటిదేదో. వాడి బొమ్మ ఇస్తాడు టెక్స్ట్ బుక్‌లో. పోనీ వాడి ఫోటోనా అదీ అంటే కాదు. చిత్రకారుడు ఆ శతాబ్దం చైనా దుస్తులు మాత్రం గుర్తుపెట్టుకుని చిన్న పీచు గెడ్డంతో, నానా అసహ్యంగా వాడిని చిత్రిస్తాడు. వాడి పేరు మనం గుర్తుపెట్టుకోవాలిట. కొంతమంది శాడిస్టు టీచర్లు బొమ్మని చార్ట్‌ల మీద వెయ్యమనీ అంటారు. ఎందుకు? అసలెందుకు పనికొస్తుంది వాడి మొహం? సందుకు నలుగురు చైనా డాక్టర్లు ఇదే మొహంతో వుంటారు. పెద్దయాక మననీ వాడిలా దేశదిమ్మరి కమ్మనా? వెళ్ళి వాడి మొహం వేసిన చార్ట్ చూపిస్తే వాడి దేశంలో మనకి ఏవైనా ఉచితంగా ఇస్తారా? అసలు ఎందుకు చదవాలి? ఎవడొచ్చాడో ఎవడు చచ్చాడో సంవత్సరం తారీఖులతో సహా? మనం ఏవైనా తద్దినాలు పెడ్తామా? నాన్‌సెన్స్. అందుకే సందానీ వీధి దీపాల వెలుగులో వాటిని చింపి పోగులు పెట్టేవాడు. పాపం నోట్ బుక్కుల్లో పేజీలు చింపి ఎన్నెన్ని చెయ్యడం నేర్పేవాడనీ? కత్తి పడవలూ, గంధం గిన్నెలూ, ఫ్యాన్లూ, కార్లూ, పట్టకార్లూ. అన్నీనూ. దానికి వాడికి రివార్డు ఇవ్వడానికి బదులు అమ్మమ్మ వాళ్ళమ్మకి చెప్పి పేము బెత్తంతో కొట్టించేది. అసలీ పేము బెత్తాలు అమ్మే నాగయ్య మొహం మండా! ఆ బెత్తాలు మమ్మల్నే ఏరి తెమ్మనేవాడు హిందీ పండిట్ నీలకంఠశాస్త్రి. వీళ్ళ శాడిజాలు తగలెయ్యా! కొడ్తే చురుక్కుమనాలిట.

సరే. సందానీ చైల్డ్ హుడ్ ఎపిసోడ్‌లో నేను ఎలాగూ వుంటాను కాబట్టి, చిన్నప్పటి హీరోయిన్ని. మా మురికి కాలవలో చేపలు పట్టడం, మేకపాలు తియ్యడం, సైకిల్ దొంగతనం చేసి, నేర్చుకోవడం, క్రిస్మిస్ టీచర్ ఇంటికి పేడ ఎత్తుకెళ్ళడంలాంటివన్నీ ఎలాగూ పెడతాం. (అక్కడో పాట) "పడకు పడకూ వెంట పడకూ పేడ వేస్తా.. దూడకి పాలనిస్తా" అని బర్రెమ్మమీద పిక్చరైజ్ చెయ్యాలి. స్కూల్లో

మాస్టర్లని ఎటూ విలన్స్‌గా చూపిస్తాం. వాడు పెరిగి పెద్దవాడౌతూవుంటే, వాడిని అస్తమానం ఏడిపించేవాడి 'బువా' కొడుకు ఆసిఫ్, వాడికి స్కూల్లో మంచి మార్కులొచ్చేవి. అంతేకాక సెలవుల్లో వచ్చే ఏటి పాఠాలు కూడా చదివేసుకునొచ్చి, వీడికి సున్నా మార్కులొచ్చాయనీ, వీడికి ట్యూషన్ చెప్తాననీ బాధించేవాడు.

పీ.టీ టీచర్ ఎప్పుడూ మేం వెళ్తే నెట్టూ, కాక్, బ్యాట్లూ ఏవీ ఇచ్చేవాడు కాదు. కాస్త పొడవుగా వుండి, పొడవాటి జడలు వేసుకుని చెవులకి పొడవాటి రింగులు పెట్టుకునే సోనియా, రిజ్వానా, రాణీలకే అన్నీ ఇచ్చేవాడు "మీ కెందుకే ఇంకా ఐదో క్లాసు దాటలేదూ?" అనేవాడు. తర్వాత అర్థమైంది. వాళ్ళకి ఎందుకిచ్చేవాడో? ఆడపిల్లలు ఎగిరెగిరి ఆడ్తారనీ? అందుకే సందానీగాడు పీ.టీ సార్ సైకిల్‌లో గాలి తీసేసేవాడు. అసలు ఆ పీటీ సార్ చేతే 'దృష్టధ్యుమ్నుడు' అని బోర్డు మీద వందసార్లు రాయించాల్సింది.

సందానీ బయోపిక్‌లో చైల్డ్ హుడ్ ఎపిసోడ్లలో కష్టాలకి కొదవలేదు, విలన్లకి కొదవలేదు. అసలు వాళ్ళ నాన్న చాలు. తాగొచ్చి వాళ్ళమ్మీజాన్‌నీ, అడ్డు పడిన వీడ్నీ రోజూ గుభీగుభీ గుద్ది, మళ్ళీ వీళ్ళ చేతే ఒళ్ళుపట్టించుకునేవాడు. పెద్దయ్యాక హీరో అయ్యాడని చూపించాలి. ఏ రాజధాని వీధులలో అయితే రిక్షా లాగాడో అదే వీధుల్లో 'బి.ఎం.డబ్ల్యూ'లో తిరిగాడని రాయాలా? లేక గిల్లీ దండ్ 'ఒలింపిక్స్'లో ఆడి స్వర్ణపతకం గెలిచాడని రాయాలా? ఏం రాయాలి? అసలు పెద్ద అయి వాడు ఏ హీరోగానో 'వాల్ పోస్టర్'లో కనిపిస్తే ఎలా వుంటుందో గదా! ఏ మినిస్టరో అయి, నన్ను చూసి 'ఏవీ రమణీ.. ఏవీ రమణీ' అని పరిగెత్తుకొస్తే ఎంత బావుంటుందీ?

ముక్కు కారుతూ, వీపు మీద ఓ కాకీరంగు సంచిలో పుస్తకాలు వేసుకుని, ఇంకో చేత్తో వాడి బక్రీ "చాందినీ" తాడు పట్టుకుని వస్తూ వుండగా "అతడే .. నడిచే ఉక్కు కణం, ముక్కు వ్రణం.. పిక్కబలం... తిక్క ఘటం.. అతడే" అని ఓ టైటిల్ సాంగ్ ఫోర్స్‌గా రాయించాలి. మాంటేజెస్‌లో వాడు రాత్రిపూట మా టెక్స్ట్ బుక్స్‌తో వేసిన భోగిమంటా, ఆ మంటలో స్కూల్లో బెంచీలూ, మాస్టారి బెత్తాలు వేసి, కసిగా చూసి, నిర్లక్ష్యంగా అరచెయ్యి తిప్పి ముక్కు తుడుచుకోవడం మేనరిజమ్స్‌గా చూపెట్టాలి.

వాడు చిన్నప్పటినుండే ప్రజాసేవ చేస్తూ ఎదగాలి. చిట్టెమ్మత్తయ్య పిడికలు ఎత్తుకెళ్ళి క్రీస్తుమణీ టీచర్ గోడమీద చరచడం అమ్మమ్మ మడితో పెట్టుకున్న వడియాలు మోసుకురాలేక పోతోందని వీడెళ్ళి, ఆ మూట బలవంతంగా లాక్కురావడం.. ఫలితంగా వాడి వీపు విమానం మోతా. అప్పుడప్పుడూ సామాజిక కార్యక్రమాలులో భాగంగా, మా పిల్లమూక అందరిళ్ళలోంచీ చీపుళ్ళూ, గంపలూ తెప్పించి రోడ్లు వూడ్పించడాలూ, ఊడవాలంటే చెత్త వుండాలి కాబట్టి రోడ్ల మీదున్న బాదం, వేప మునగ చెట్లని బాగా వూపి ఆకులు రాలేట్లు చెయ్యడం, కలరా ఇంజెక్షన్స్ ఇచ్చేవాళ్ళొస్తే మమ్మల్ని అందరినీ బలవంతంగా లాక్కెళ్ళి పొడిపించడం లాంటివి. రాబిన్ హుడ్ క్రూసోలాగా, మా అమ్మమ్మా, ఎదురింటి నాయుడుగారూ లాంటివాళ్ళ జేబుల్లో నుండీ, పోపుల పెట్టెలో నుండీ డబ్బులు దోచి మాలాంటి బికారి పిల్లలందరికీ ఐస్ ఫ్రూట్స్ కొనిపెట్టడం ఇవన్నీ బిల్డప్ షాట్స్. మరి పెద్దయి ఏమైపోయాడో? ఏమో నాకూ తెలీదు. కానీ చిన్నతనంలో చాలా కష్టాలు పడి, ఇరుగు పొరుగు వాళ్ళకి పెట్టి పెరిగాడు కాబట్టి, తప్పకుండా హీరోనే అయ్యుంటాడు.

హీరో దివాలా తీస్తే ఆయన్ని అయిన వాళ్ళే మోసం చేసారు అంటారు. హీరోకి అన్ని చోట్లా ఎదురు దెబ్బలే తగిల్తే 'విధి వెక్కిరించింది' అంటారు. అసలు హీరో ఎందుకు మంచితనం ముసుగులో అందరికీ ఉన్నది పంచి, బికారిగా మారి, స్వంత కుటుంబాన్ని దిక్కులేనివాళ్ళని చేసి, దానమో, వ్యసనమో ... అవన్నీ చేసినప్పుడు ఏ పెళ్ళామో చింత బరికె పుచ్చుకుని బాదితే దారికొచ్చేస్తాడుగా. ఆ సీన్లు చూపించరు. పెళ్ళాం కూడా ఈయనతోబాటు తన ముక్కునుండీ ముక్కుపుడుక తీసి, నిలువుదోపిడీ ఇచ్చి ముక్కూ మొహం తెలీని వాళ్ళకి దానం చేసినట్లూ, ఆ పుచ్చుకున్న వాళ్ళు తర్వాత వీళ్ళ మొహాలు చూడనట్లూ చెప్తారు.

ఎవడి చాతకాని తనం వాడే అనుభవించాడు - డబ్బులు కన్నూ మిన్నూ కానక ఖర్చుపెట్టడం, దానం చెయ్యడం ఒక వ్యసనమే అని చూపిస్తే కొంత బెటరేమో. కానీ వాళ్ళ వీక్‌నెసులూ, తప్పులూ చూపిస్తే అది బయోపిక్ ఎందుకౌతుందీ?

సందానీగాడికి లెక్కలు రాకపోవడం, ఎక్కాలు నేర్చుకోకపోవడం తప్పుగాదు. లెక్కల టీచర్ చెవులు పిండి నేర్పించడం విలనిజం. పెద్దయినా ఇవే సీన్లు కొంచెం పెద్ద మోతాదులో .... అంతే.

తప్పులు చెయ్యడం, వేరొకరు వీరిని మోసం చెయ్యడం వలన అవి చూపించాలి. సందానీ దొంగతనాలకి కారణం వాళ్ళ బీదరికం. దానికి కారణం వాళ్ళ అబ్బాజాన్ తాగుడు. దానికి కారణం ప్రభుత్వం. పెట్టుబడిదారీతనం. అసలు ప్రతి నేరానికీ కారణం ఈ ప్రభుత్వ వైఫల్యం. దట్సాల్. రైజ్ ఎండ్ ఫాల్. దటీజ్ లైఫ్. ఎవరి బయోపిక్ అయినా ఫార్ములా ఇదే. మనని మెచ్చుకోనోళ్ళు, ఉచితంగా ఏదీ ఇవ్వని వాళ్ళూ విలన్లు.

పెళ్ళయి ముప్పై ఏళ్ళులొట్టలేస్తూ పెళ్ళాం వంట తిని, టీ.వీలో చేతులు లేని జాకెట్టు వేసుకున్న పిల్ల సెనగపిండి జల్లి పుల్లిపాయకూర ఎలా చెయ్యాలో చెప్తుంటే లొట్టలేస్తూ, పెళ్ళాలని పిలిచి "చూడు ఎలా చెయ్యాలో నేర్చుకో" అనే మొగుళ్ళని విలన్లుగా చూపిస్తూ, ప్రతి ఇల్లాలూ ఓ బయోపిక్ టూత్ పిక్స్ అంత తేలిగ్గా తీసి పారెయొచ్చు. దట్సాల్!




Post your comments

https://www.youtube.com/watch?v=ERaaX_IulS4

